క్లుప్తంగా

ఎక్సైజ్ అధికారుల దాడులు


పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్ అధికారులు

చింతలపూడి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో సోమవారం నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. మండలంలోని వడ్డరగూడెం గ్రామంలో 5 లీటర్ల నాటు సారా కలిగి ఉన్న మల్లి చిన తిరుపతయ్యను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. అలాగే నాటు సారా కేసుల్లో నిందితులైన తిమ్మిరెడ్డిపాలెంకు చెందిన తాళం శివకుమారి, బెల్ట్ షాపు నిర్వాహకుడు మదిరెడ్డి శంకరరావులను చింతలపూడి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు అబ్దుల్ ఖలీల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెం ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు క్లబ్ సభ్యుడు మేడిశెట్టి శంకర్రావు తెలిపారు. ఈ శిబిరంలో నిడదవోలుకు చెందిన ఆర్ఆర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యులు రోగులకు సేవలు అందిస్తారని తెలిపారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు, తక్కువ ధరకు కళ్లజోళ్లు అందిస్తామన్నారు. అలాగే శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారిని నిడదవోలులో ఆస్పత్రికి తీసుకెళ్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన


ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెం క్లస్టర్ పరిధిలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను నిర్వహించారు. రైతు నుంచి నేరుగా వినియోగదారులకు అందించే నిమిత్తం ఈ స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సహజ సిద్ధంగా పండించిన ఆహార ఉత్పత్తులనే తిందాం..ఆరోగ్యాన్ని కాపాడుకుందామని వారు సూచించారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ


వసంతరావును పరామర్శిస్తున్న నేతలు

లింగపాలెం: మండలంలోని తిమ్మక్కపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వసంతారావు సతీమణి ధనలక్ష్మి (84) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రాష్ట్ర లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్, మండలం సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు ముసునూరి వెంకటేశ్వరరావు సోమవారం వసంతరావు కుటుంబాన్ని పరామర్శించి మనో ధైర్యాన్ని అందించారు.

నష్టపరిహారం చెక్కుల అందజేత


చెక్కులు అందజేస్తున్న సబ్ డీఎఫ్‌వో

పోలవరం రూరల్: చిరుతపులి దాడిలో మేకలు కోల్పోయిన బాధితులకు నష్ట పరిహారం చెక్కులను పోలవరం అటవీశాఖ రేంజ్ కార్యాలయం వద్ద సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య అందజేశారు. గత రెండు నెలల్లో పోలవరం మండలంలో ఉడతపల్లి , సున్నాల గండి ప్రాంతాల్లో చిరుతపులి దాడి చేసి ముగ్గురు గిరిజన రైతులకు చెందిన మేకలను చంపేసింది. బాధితులకు రూ.94 వేల చెక్కులను అందజేసినట్లు రేంజర్ ఎస్కే వలీ తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఈ నెల 6 తుది గడువు

లింగపాలెం: ఎంఎల్‌సీ పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ఈ నెల 6వ తేదీ తుది గడువని తహసీల్దార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగపాలెం మండలంలో నివాసం ఉండి డిగ్రీ పూర్తి చేసిన వారు ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఎంపీడీవో, ఎంఈవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు.

రహదారా ? డంపింగ్ యార్డా ?

- దుర్గంధం, పొగతో ప్రయాణికుల ఇక్కట్లు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరుతున్న వైనం


రహదారిని డంపింగ్ యార్డుగా వినియోగిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: చింతలపూడి–టి.నరసాపురం రహదారిని చింతలపూడి నగర పంచాయతీ వారు ఏళ్ల తరబడి డంపింగ్ యార్డుగా వినియోగించడం వలన ప్రయాణికులు నిత్యం నిత్యం నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా ఉంటుంది. ఒక పక్క గోతులు, మరో పక్క దుర్గంధం, పొగ వెదజల్లడంతో ఈ రహదారిలో ప్రయాణించడమే చాలా కష్టంగా మారింది. చింతలపూడి నుంచి టి.నరసాపురం వచ్చే రహదారిలో చింతలపూడి నుంచి 2 కిలోమీటర్ల దూరంలో స్థానిక చెరువు వద్ద రోడ్డు మార్జిన్‌ను నగర పంచాయతీ వారు డంపింగ్ యార్డుగా వినియోగిస్తున్నారు. నగరంలోని చెత్త, చెదారాన్ని ప్రతీ నిత్యం వాహనాలతో ఇక్కడకు తరలించి రోడ్డు అంచునే పెద్దపెద్ద గుట్టలుగా చెత్తను వేస్తున్నారు. రోజుల తరబడి రోడ్డు అంచునే చెత్తా చెదారం నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుంది. అమావాస్యకో, పున్నానికో ఒకసారి ఆ చెత్తను తగుల బెడుతున్నారు. దీంతో ఆ రోజంతా దట్టమైన పొగ వెదజల్లి ఆ రహదారిలో ప్రయాణించడమే కష్టసాధ్యంగా మారుతుంది. ఏళ్ల తరబడి ఇక్కడ రోడ్డు మార్జిన్‌ను డంపింగ్ యార్డుగా వినియోగించడం, చెత్త పేరుకుపోయినప్పుడల్లా, ఒక్కోసారి ఆ చెత్తను వెనక్కు నెట్టడంతో అక్కడ ఉన్న చెరువు సైతం ఇప్పటికే దాదాపుగా పూడుకుపోయింది. దాదాపు 400 మీటర్ల పొడవునా రహదారి వెంబడి ఈ చెత్తను వేయడం వలన రహదారివాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. నగరపంచాయతీకి ప్రత్యేకమైన డంపింగ్ యార్డు స్థలం కేటాయించుకోవాల్సి ఉన్నా ఆ దిశగా నాయకులు గాని, అధికారులు గాని ప్రయత్నాలు చేయడం లేదు. చెత్తను ఈ రహదారిలో డంప్ చేసి, చేతులు దులుపుకుంటున్నారు. ఈ విషయంపై పలువురు ప్రజలు, ప్రజా సంఘాల నేతలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న నాధుడే లేరు. మండల కేంద్రమైన టి.నరసాపురం ప్రజలు ప్రతీ చిన్న అవసరానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతలపూడి వెళ్లాల్సి ఉంది. టి.నరసాపురం మీదుగా వెళ్లే జంగారెడ్డిగూడెం–చింతలపూడి ప్రధాన రహదారి కూడా ఇదే. ఈ రహదారిలో వాహనదారులతో అనునిత్యం రద్దీగానే ఉంటుంది. ఇకనైనా అధికారులు రోడ్డు మార్జిన్‌ను డంపింగ్ యార్డుగా వినియోగించడాన్ని నిలిపివేయాలని కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి



చింతలపూడి నగరపంచాయతీ వారు టి.నరసాపురం రహదారిని డంపింగ్ యార్డుగా వినియోగించడం నిలిపివేయాలి. ఇక్కడ డంపింగ్ యార్డు నిర్వహణ వలన దుర్గంధ భరితమై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చింతలపూడి డంపింగ్ యార్డుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. జిల్లా అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– ఎస్‌డీ నాసర్ పాషా, సామాజిక కార్యకర్త, టి.నరసాపురం

ఉపాధ్యాయుడిపై ఎంఈవోకు ఫిర్యాదు


ఎంఈవోకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

కుక్కునూరు: విధులకు సరిగా హాజరు కాని ఉపాధ్యాయుడిపై చర్యలు చేపట్టాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. మండలంలోని నెమలిపేట ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.మల్లప్ప పాఠశాలకు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ఒకవేళ హాజరైన ఆలస్యంగా రావడం, పాఠశాలకు మద్యం సేవించి వచ్చి విద్యార్థులను మధ్యాహ్నం సమయంలో గోడ కుర్చీ వేయిస్తున్నాడని, దీంతో చిన్నారులు పాఠశాలకు వెళ్లడానికి భయపడుతున్నారని ఎంఈవో గిరిభగవాన్ దాస్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఉపాధ్యాయుడిని మార్చాలని ఒక వేళ అతనినే కొనసాగిస్తే తమ పిల్లలను పాఠశాలకు పంపమని వారు ఎంఈవోకు తెలిపారు.

కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది


వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, డాక్టర్ సుబ్రమణ్యం దంపతులను పరామర్శిస్తున్న కంభం విజయరాజు

కామవరపుకోట: కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అన్ని విధాల అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. సోమవారం మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పాతూరులో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం మాతృమూర్తి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను, మారుతీనగర్‌లోని వైఎస్సార్‌సీపీ నాయకులు చిలుకూరి సుబ్బారావు తనయుడు మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ అన్ని విధాల కార్యకర్తలకు అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం కొత్తూరులో మృతి చెందిన కలిదిండి వెంకట నరసరాజు, కలిదిండి సత్తిరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సాయన కనకరాజు, నానాది సాగర్, పోలిమెట్ల ప్రశాంత్, కొవ్వూరు భాగ్యరాజు, మేడంకి పద్మ, చిన్న, జాన్, సాయల స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

కబ్జా భూములపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్ కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

కొయ్యలగూడెం: కబ్జాకి గురైన ప్రభుత్వ భూములపై సత్వరమే రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ రెడ్ స్టార్ శ్రేణులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఈ మేరకు ధర్నా చేపట్టారు. మంగపతిదేవిపేట రెవెన్యూ పరిధిలో కబ్జాకు గురైన ఆర్ఎస్ నెంబర్ 18, 19లో 31 ఎకరాల సీలింగ్ భూములు కబ్జాకు గురయ్యాయని, సీలింగ్ భూములను ప్రభుత్వం వారు వెంటనే స్వాధీనం చేసుకుని పీవోటీ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా తహసీల్దార్ స్పందించి వెంటనే భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని లేకపోతే పేదలే ఆ సీలింగ్ భూములను స్వాధీనం చేసుకుని వ్యవసాయం చేస్తారని ఇందుకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కమిటీ నాయకులు మడకం రామన్న, నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కలింపూడి సుందర్రావు, డి.సమ్సోను, ఎం.నాగమణి, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ

- క్షేత్రపాలకుడికి విశేష అభిషేకాలు
- శివాలయాల్లో కార్తీక శోభ


ద్వారకాతిరుమల: కార్తీక దీపాలు వెలిగిస్తున్న అయ్యప్ప, శివ స్వాములు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడిగా విరజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో కార్తీక తొలి సోమవారం సందర్భంగా విశేష కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఉదయం ఆలయంలో శివయ్యకు అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజాదికాలను నిర్వహించారు. ఆలయ ఆవరణలోని ఉసిరి చెట్ల వద్ద అయ్యప్ప, శివ స్వాములు, మహిళా భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. సాయంత్రం గంగా, పార్వతీ సమేత శివదేవుడు నంది వాహనంపై క్షేత్ర పుర వీధుల్లో ఊరేగారు.

శివనామ స్మరణతో శైవక్షేత్రాలు

కొయ్యలగూడెం: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలు పంచాక్షరి మంత్రంతో ప్రతిధ్వనించాయి. కన్నాపురం, యర్రంపేట, కొయ్యలగూడెం, అంకాలగూడెం గ్రామాలలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల సౌజన్యంతో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమాల్లో ప్రజలు భారీగా పాల్గొన్నారు.

ముక్కంటికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: పవిత్ర కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమ్రోగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించి, అనంతరం ఈశ్వరుడికి అభిషేకాలు నిర్వహించారు. అశ్వారావుపేట రోడ్డులో శ్రీ సర్వమంగళ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వయంగా ఆవు పాలు, మంచినీటితో అభిషేకాలు నిర్వహించారు. వాసా రామకృష్ణ, పీవీ రామలక్ష్మి, పరుచూరి మధు, వాసా కోటేశ్వరరావు, వెనిగళ్ల రాధా మాధవ్ పాల్గొన్నారు.


బుట్టాయగూడెం: కార్తీక దీపోత్సవం చేస్తున్న మహిళలు

ఘనంగా కార్తీక సోమవారం

పోలవరం రూరల్: కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో శివక్షేత్రాలు శివనామ స్మరణతో మారుమ్రోగాయి. పోలవరం మండలం పట్టిసం శివక్షేత్రంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పవిత్రగోదావరి నదిలో స్నానమాచరించి క్షేత్ర ప్రాకారంలో సామూహిక పూజా కార్యక్రమాల్లో పాల్గొని ధ్వజస్తంభం వద్ద భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు.


జంగారెడ్డిగూడెం: శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం: కార్తీకమాసం ప్రారంభమైన తొలి సోమవారం శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. శివుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. స్థానిక త్రిపుర సుందరీ సమేత కామేశ్వరస్వామివారి ఆలయం, కొమ్ముగూడెం సమీపంలో గల శివాలయం, చింతలగూడెం శివాలయం, బెడదనూరు శివాలయం వద్ద భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం స్థానిక కొత్తపేటలో ఉన్న నందగోకుల రాధాకృష్ణ స్వామి ఆలయంలో సామూహిక కార్తీక దామోదర దీపోత్సవాన్ని మహిళలు నిర్వహించారు.

సాగును సంక్షోభంలోకి నెట్టేస్తున్నారు

రైతు కూలీ సంఘం


సభలో మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం మాజీ కార్యదర్శి నాగరాజు

పోలవరం రూరల్: ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా ఆందోళన వ్యక్తం చేశారు. దీని ఫలితంగా రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయన్నారు. రైతులు పండించే పంటలకు కనీస మద్దతు ధర అమలు చేయడం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో రైతాంగం సంఘటితంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. మండలంలోని మనుగోపుల ప్రాంతంలో సోమవారం రైతు కూలీ సంఘ మహిళా నేత కారం పార్వతి వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నేతలు పాల్గొని ఆమెకు నివాళులర్పించారు. సంఘ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎంఎస్ నాగరాజు, ఏజెన్సీ గిరిజన సంఘం కార్యదర్శి కుంజం రామారావు పాల్గొన్నారు.

ఆటోలకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి



ధర్నా చేస్తున్న ఆటో డ్రైవర్లు

కుక్కునూరు: రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ, కుటుంబ పోషణ కోసం ఆటోలు నడుపుతూ జీవనోపాధి పొందుతున్న ఆటో డ్రైవర్లు పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందించారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు పోచారపు వెంకటేశ్వర్లు, సీఐటీయూ సహాయ కార్యదర్శి తిరోజుల సురేష్,దారక్రిష్ణ,గరటం హరీష్, లోకి, గోపి పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా కామవరపుకోట మండలానికి చెందిన ఒక వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ మానసికవేదనకు గురై పురుగుమందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన పొన్నగుల జీవరత్నం (54) భార్య మరణించడంతో కుమారుడుతో పాటు కొత్తవారిగూడెంలో నివసిస్తున్నాడు. అతనికి దీర్ఘకాలిక వ్యాధులు ఉండడంతో జీవితంపై విరక్తి చెందిన సోమవారం మధ్యాహ్నం కలుపుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

సర్వే చేసి ఆక్రమణలు తొలగించండి


రహదారిని సర్వే చేస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం: తాడువాయి, ఎ.పోలవరం గ్రామపంచాయతీలను కలిపే పంచాయతీ రోడ్డు ఆక్రమణకు గురైందని చర్యలు తీసుకోవాలని తాడువాయి, ఎ.పోలవరం గ్రామాల రైతులు, ప్రజలు వేడుకుంటున్నారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో వినతులు సమర్పించారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ ఆదేశాల మేరకు స్థానిక వీఆర్‌వో, వీఆర్ఏ, సర్వేయర్లతో కలిసి అధికారులు రహదారి సర్వే నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాడువాయి శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న వీరన్న చెరువు నుంచి ఎ.పోలవరం గ్రామ పంచాయతీ పొలిమేర పుంత వరకు 60 అడుగుల వెడల్పు పంచాయతీ రోడ్డు ఉంది. ఈ రోడ్డు వెంబడి సుమారు 30 మంది వ్యవసాయ రైతులు ఉన్నారు. ఈ రోడ్డు ద్వారా వ్యవసాయ పంటలు తరలిచేందుకు, తాడువాయి–ఎ.పోలవరం గ్రామ ప్రజలు ప్రయాణించేందుకు వినియోగిస్తున్నారు. ఈ రోడ్డును ఎ.పోలవరం గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆక్రమించి జేసీబీతో దున్ని వ్యవసాయభూమిగా మార్చేశారన్నారు. దీంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. రోడ్డును సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని కలెక్టరేట్‌లో ఇచ్చిన అర్జీలో వారు కోరారు.

పెట్టుబడి సాయం అందించాలి


వినతిపత్ర అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

చింతలపూడి: రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతు ఖాతాల్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర పిలుపులో భాగంగా సోమవారం చింతలపూడి 2, 5 సచివాలయాల్లో కార్యదర్శులకు రైతు సంఘం ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, జంగా రామచంద్రారెడ్డి, రైతు సంఘం నాయకులు సంకు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి ఆలయంలో వ్రతాలు

లింగపాలెం: రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన లింగపాలెం మండలం రంగాపురంలోని శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం పెద్ద సంఖ్యలో వ్రతాలు నిర్వహించారు.

పోలవరం నిర్వాసిత రైతుల ఆందోళన

ఏలూరు (టూటౌన్): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, రైతులు బ్యాంక్ అధికారుల తీరు వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగ ప్రభాకర్ ,జిల్లా నాయకులు ఎం.వెంకటాచారి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బాధిత రైతులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. 2017లో తీసుకున్న రుణాలకు సంబంధించి పోలవరం నిర్వాసిత రైతుల వద్ద భూసేకరణ డబ్బుల నుంచి రికవరీ చేశారని వారు తెలిపారు. భూసేకరణ డబ్బులు రాకముందే రికవరీ చేసిన బ్యాంకు.. మళ్లీ భూ సేకరణ డబ్బుల నుంచి కూడా రికవరు చేయటం విడ్డూరంగా ఉందని వారు పేర్కొన్నారు.

నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి


సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్

కామవరపుకోట: శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాన్ని స్వదినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ముందంజలో ఉండాలని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేఏవీఎల్ పద్మావతి అన్నారు. మండలంలోని వీరిశెట్టిగూడెం అడ్డరోడ్డు సమీపంలోని ఎన్టీఆర్ మహిళా ప్రాంగణంలో బ్యూటీషన్, మగ్గం వర్క్ శిక్షణా ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న 55 మందికి అభినందనలు తెలిపారు. జంగారెడ్డిగూడెం సీడీపీవో పి.బ్యూల, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ బి.రేబాక శామ్యూల్, ఎక్సటెన్షన్ అధికారి మల్లిక, శిక్షకులు మల్లీశ్వరి, ప్రసన్న పాల్గొన్నారు.